క్లుప్తంగా

ఇసుక రవాణాకు అడ్డుకట్ట ఏదీ?



మద్నూర్: మండలంలోని సిర్‌పూర్, కుర్లా ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తూ డోంగ్లీ మండలంలోని ఎన్‌బురా, సిర్‌పూర్, కుర్లా, ఇలేగావ్ గ్రామాల్లో డంప్ చేస్తున్నారు. నిత్యం ఇసుకను తరలిస్తూ మరో చోట డంప్ చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. డంప్ చేసిన ఇసుకను సమీప రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలోని సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని లెండి, మంజీరా వాగుల నుంచి కూడా అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తున్నారు.

మహదేవ్ స్వామీజీ మహాపాదయాత్ర



సదాశివనగర్: సద్గురు మహదేవ్ స్వామీజీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాద యాత్ర ఆదివారం రాత్రి సదాశివనగర్‌కు చేరుకుంది. మహారాష్ట్రలోని ఔరాద్ నుంచి యాత్ర ప్రారంభమైనట్లు వీరశైవ లింగాయత్‌లు తెలిపారు. వచ్చే నెల 3వ తేదీన యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో యాత్ర ముగిస్తున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, కుర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్కంటి బుచ్చన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, గిద్ద సర్పంచ్ రాంరెడ్డి, వీరశైవ లింగాయత్ జంగమ సమాజం ప్రతినిధులు బంజ శివకుమార్, బంజ బస్వయ్య, విజయ్‌కుమార్, జంగం గంగాధర్, జంగం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సదాశివనగర్: మండల కేంద్రంలోని శ్రీ వాణి విద్యాలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ బీరయ్య, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎస్సై రాజేశ్, పాఠశాల కరస్పాండెంట్ సువర్ణరాణి గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు హన్మంత్ రవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కామారెడ్డి టౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. కాలువపై ఉన్న కల్వర్టు ధ్వంసమై మూడు నెలలైనా వాటికి మరమ్మతు పనులు చేపట్టడం లేదు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంత పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులున్నా పనుల నిలిపివేత



నిజాంసాగర్: మండలంలోని బూర్గుల్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. భవన నిర్మాణానికి ఐదేళ్ల కిందట మంజూరు చేసిన రూ.13 లక్షలతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. నిధులు సరిపడకపోవడంతో పనులు పూర్తి చేయకుండా నిలిపివేశారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ఎస్‌డీఎఫ్ పథకం కింద రూ. 5 లక్షలు మంజూరు చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

ఆయిల్ పాం.. రైతుకు ఆర్థిక భారం

- మొక్కలకు సోకుతున్న తెగులు
- ఆందోళనలో రైతన్న



మల్యాపూర్‌లో సాగుచేస్తున్న ఆయిల్ పాం తోట

బీబీపేట: ఆయిల్ పాం సాగు రైతుకు ఆర్థిక భారంగా మారింది. సాగు చేయాలని ప్రభుత్వం ప్రచారం కల్పిస్తూ మొదట మండల కేంద్రాలు, ఆ తర్వాత గ్రామాలకు విస్తరించాలనే ఉద్దేశంతో రైతులకు అవగాహన కల్పించారు. ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ వస్తాయని అధికారులు ప్రచారం కల్పించడంతో రైతులు ముందుకొచ్చి చాలా చోట్ల ఆయిల్ పాం మొక్కలను నాటారు. అయితే వాటికి తెగులు సోకుతుండటంతో వాటి నివారణ కోసం వాడే మందుల ఖర్చు ఎక్కువవుతోంది. ప్రభుత్వం ప్రచారం కల్పించడం మినహా సాగుకు నిధులు కేటాయించకపోవడంతో ఆర్థిక భారం పడుతోంది. ఆయిల్‌పాం సాగు కోసం రైతులకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు మాత్రమే ప్రభుత్వం ఇస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి మొక్కలు తీసుకురావడం, వాటిని నాటడం, కంపోస్టు ఎరువు, రసాయన ఎరువులు, కూలీల ఖర్చు రైతులే భరించాల్సి వస్తోంది. చాలా చోట్ల మొక్కలు నాటిన రెండు నెలల్లోపే తెగులుతో ఎండిపోతున్నాయి. జిలాలో 1,500 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కలు నాటేందుకు ఒక్కో గుంత రెండు అడుగుల లోతు, వెడల్పు ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఒక్కో గుంత తీసేందుకు రూ. 120, నాటేందుకు అదనంగా రూ. 100 వరకు తీసుకుంటున్నారు. ఎకరంలో మొక్కలు నాటాలంటే రూ. 10 వేలు ఖర్చు అవుతోంది. దీనికి ఎరువుల ఖర్చు అదనం. మొక్కలకు పురుగు సోకి ఎండిపోతుండటంతో ఏం చేయాలో తోచక రైతులు అయోమయంలో ఉన్నారు. ఎకరాకు రూ. 1,500 వరకు మందుల ఖర్చు అవుతోందని రైతులు వెల్లడించారు. రైతులకు ఆర్థిక భారం తగ్గించేందుకు వీలుగా వాటి సాగుకయ్యే కూలీల ఖర్చు తగ్గించేందుకు వీలుగా జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉచితంగా ఇవ్వాలి

ఆయిల్‌పాం సాగుకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి. సబ్సిడీ ద్వారా మొక్కలు ఇస్తున్నా వాటిని పెంచేందుకు ఖర్చు ఎక్కువ అవుతోంది. కూలీల ఖర్చుల తగ్గించేందుకు ఉపాధి పనులను అనుసంధానం చేయాలి.

–గోవింద్‌రాజ్, రైతు, బీబీపేట

నిర్మాణానికి ఆరేళ్లు.. ప్రారంభానికి ఎన్నేళ్లో!



పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహం

నిజాంసాగర్: మండల కేంద్రమైన నిజాంసాగర్‌లో రూ. కోటి ఖర్చు చేసి అతిథి గృహం నిర్మించినా ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అతిథి గృహం నిర్మాణానికి 2016లో అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగినా ఎట్టకేలకు ఆరేళ్ల తర్వాత పూర్తి చేశారు. భవనాన్ని వినియోగంలోకి తీసుకరాక పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

సమయం వృథా చేయకుండా చదవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉన్న 8వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థినులకు ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా చదవాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎజాస్, ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, కౌన్సిలర్లు హకీం, శివ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు హిరాలాల్, వార్డెన్ గంగసుధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు కబ్జా చేస్తే ఊరుకోం



మాచారెడ్డిలో మాట్లాడుతున్న కురుమ సంఘం నేతలు

మాచారెడ్డి: బీరప్ప ఆలయ భూములను కబ్జా చేయాలని చూస్తే ఊరుకోమని కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చెట్కూరి రజినీకాంత్ హెచ్చరించారు. మాచారెడ్డిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీరప్ప ఆలయ భూమిని కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. సర్వే నంబరు 110 లో కురుమ సంఘానికి చెందిన 8 గుంటల భూమి తాతల కాలం నుంచి కులస్తుల ఆధీనంలో ఉందని, ఆ భూమిపై కన్ను పడిన ఓ వర్గం బీరప్ప ఆలయాన్ని కూల్చి ఇతర నిర్మాణాలను చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్, నాయకులు శ్రీకాంత్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

సదాశివనగర్: మండల కేంద్రంలోని రైతు భవనంలో సోమవారం ఎంఎన్‌జే ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నల్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ధర్నా

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు వెంటనే అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు టీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకుడు సిద్ధిరాములు తెలిపారు. సమావేశంలో బీఎల్ఎఫ్, బీఎల్‌టీయూ నాయకులు ఆంజనేయులు, కమ్మరి సదానందం, వడ్ల సాయి కృష్ణ పాల్గొన్నారు.

ప్రజావేదిక

లింగంపేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామి పథకం పనులకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, కూలీలు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

బీరప్ప కల్యాణోత్సవం

లింగంపేట: మండలంలోని బోనాల్ గ్రామంలో బీరప్ప కావరాతి కల్యాణ మహోత్సవాన్ని యాదవులు, కురుమ గొల్ల కులస్తుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నారు.

మార్చి 1న ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన..

లింగంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 1వ తేదీ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన, స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, పూజారి రంగచారి తెలిపారు.

మట్టి స్నానాలతో రోగాలు దూరం



జంగంపల్లి చెరువులో మట్టి స్నానాలు చేసిన ఎస్ఎస్‌వై యోగా కేంద్రం ప్రతినిధులు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి పెద్దచెరువులో కామారెడ్డి ఎస్ఎస్‌వై యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మట్టి స్నానాలు చేశారు. జిల్లా యువజన క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రామిరెడ్డి మాట్లాడుతూ మట్టి స్నానం వల్ల రక్తప్రసరణ మెరుగుపడడంతో పాటు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుందన్నారు. చక్కెర, బీపీ లాంటి వ్యాధులు నయం అవుతాయన్నారు. మట్టి స్నానం కోసం పుట్టమన్ను, కలబంద, వేప, ఆవు మూత్రం ఇతర సుగంధ ద్రవ్యాలతో కూడిన మిశ్రమాన్ని తగినంత నీటిలో కలిపి ఒంటికి లేపనం చేసి గంట తర్వాత చెరువులో లేదా నదిలో స్నానం చేయాలని పేర్కొన్నారు. ఎస్ఎస్‌వై ప్రతినిధులు అంతిరెడ్డి, గరిపల్లి అంజయ్య, రాంచంద్రం, అంజయ్య, రఘుకుమార్, అనిల్‌రెడ్డి, సిద్దగౌడ్, వెంకట స్వామి, గంగారెడ్డి, సతీష్, సురేషు, రాజు పాల్గొన్నారు.

పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో?



ప్రధాన రహదారిపై నిలిచిన బస్సులు

నాగిరెడ్డిపేట: మండలకేంద్రంలోని గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వేసిన సిమెంట్ రోడ్డుకు అటు వైపు, ఇటువైపు మొరం వేయక పోవడంతో బస్సులు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు బస్టాండు లోపలకు బస్సులు వెళ్లే మార్గంలో మోరీ పైకప్పు కూలి పెద్దగుంత ఏర్పడింది. దీంతో ఏడాది కాలంగా బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకుండా ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోంది.

కార్యవర్గం ఎన్నిక

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ టౌన్: అంబేడ్కర్ సంఘం బాన్సువాడ డివిజన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గైని విఠల్, అధ్యక్షుడుగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా కంతి సాయిలు, మన్నే చిన్న సాయిలు, కృష్ణ, పరశురాం, రమేష్, ప్రధాన కార్యదర్శిగా గైని సురేష్, సహాయ కార్యదర్శిలుగా శివ, సాయిలు, కోశాధికారిగా మల్లూరి సాయిలును ఎన్నుకున్నారు. సలహాదారులుగా క్యాకయ్య, చింతల గంగాధర్, వినోద్, రవీందర్, బాల్‌రాజ్, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాములు, మైశయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి..



నస్రుల్లాబాద్(బీర్కూర్): దళిత హక్కుల పోరాట సమితి బీర్కూర్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా కుర్తి విరేశం, ప్రధాన కార్యదర్శిగా సంగు గోవర్ధన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కాదేపురం గంగారాం, దత్తు, కొడవల రమేష్ కుమార్ పాల్గొన్నారు.

నర్సరీల్లో ఎండుతున్న మొక్కలు



బాన్సువాడ రూరల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయితీలో నర్సరీలను ఏర్పాటు చేశారు. గత ఏడాది నాటి మిగిలిపోయిన మొక్కలతో పాటు కొత్తగా సిద్ధం చేస్తున్న మొక్కలకు సరిపడా నీళ్లు అందకప పోవడంతో ఎండిపోతున్నాయి.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేయాలి



రాజంపేట: ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్‌ను ఆదివారం రాజంపేట మండల ముదిరాజ్ సంఘం నాయకులు జింక భాస్కర్, నవీన్ కలిసి అభినందించారు. ముదిరాజ్ జాతి అభ్యున్నతికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బాన్సువాడ వెళ్లే మార్గంలో రెండు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూల మలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, మూలమలుపుల వద్ద రోడ్డును విస్తరించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



బోర్లం క్యాంపు వద్ద ప్రమాదకరంగా మలుపు

వేతనాలు ఇవ్వలేదని భిక్షాటన



ఎల్లారెడ్డిలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎల్లారెడ్డి: నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆదివారం ఎల్లారెడ్డిలో భిక్షాటన చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు పేర్కొన్నారు. కార్మికులు ప్రభాకర్, బాలయ్య, పూల్‌సింగ్, సాయిలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటల రక్షణకు కష్టాలు



మొక్క జొన్న పంట చుట్టూ వేసిన చీరలు

తాడ్వాయి: అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అడవి జంతువులు పొలాల్లోకి వచ్చి పంటను ధ్వంసం చేస్తుండటంతో రక్షణగా పొలం గట్లు వద్ద పాత చీరలను కడుతున్నారు. మొక్కజొన్న, సోయ, చెరుకు, శనగ, వరి, జొన్న తదితర పంటలను కోతులు, అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మికం

బేడీల మైసమ్మకు బోనాలు



నిజాంసాగర్: మండలంలోని గోర్గల్ గ్రామంలో బేడీల మైసమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇంటికి ఒకరు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి, సర్పంచ్ అంబవ్వ, గ్రామ పెద్దలు దుర్గారెడ్డి, కాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దేవేందర్, రామాగౌడ్, అంజి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

భవానీపేటలో..

లింగంపేట: మండలంలోని భవానిపేటలో ఆదివారం ముదిరాజ్ కులస్థుల ఆధ్వర్యంలో పెద్దమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామ దేవతలకు..

నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్, అక్కంపల్లి గ్రామాల్లో ఆదివారం నల్లపోచమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ దేవతలకు గౌడ కులస్తులు బోనాలు సమర్పించారు. అనంతరం ఇరుగ్రామాల శివారులో రేణు



కాదేవి స్థిరప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

నర్సింహుడి ఆలయంలో భక్తుల సందడి



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభరాంచంద్రం, అర్చకులు నర్సింహచార్యులు, శ్రీనివాసచార్యులు, పరందామచార్యులు, సంజీవచార్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యూనియన్ అభివృద్ధికి కృషి



బాన్సువాడ టౌన్: విద్యుత్ శాఖ ఎంప్లాయిస్ 327 యూనియన్‌కు చెందిన బాలయ్య ఆదివారం 1104 యూనియన్‌లో చేరారు. యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలయ్యను నాయకులు విష్ణుగౌడ్, గంగాధర్, షేర్ అలీ, వెంకటేష్, శ్రీనివాస్, లింగం, సురేష్, బాలజీ, సాయన్న, హుస్సెన్ తదితరులు సన్మానించారు.

డిమాండ్లు పరిష్కరించాలి



సదాశివనగర్: మాజీ సైనికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు మండలంలోని పలువురు మాజీ సైనికులు తరలివెళ్లారు. ప్రభుత్వం ద్వారా ఎలాంటి సంక్షేమ ఫలాలు తమకు చేరడం లేదని మాజీ సైనికులు పాపిరెడ్డి, హమీద్, జగన్, రాజిరెడ్డి, రవి పేర్కొన్నారు.

పందుల స్వైర విహారం



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతున్న విషయాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. రైతులకు సంబంధించిన పంట పొలాలను కూడా ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షణ



ఎల్లారెడ్డి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు టీవీ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.